పేదలకు అండగా సీఎం సహాయనిధి

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

మియాపూర్, అక్టోబర్ 30: నిరుపేద ప్రజలకు అండగా సీఎం సహాయనిధి పథకం నిలుస్తున్నదని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. తన నిరంతర సేవల ద్వారా వారి ఆరోగ్యానికి సంపూర్ణ భరోసాను కల్పిస్తున్నదన్నారు. మాదాపూర్ డివిజన్ మాదాపూర్‌కు చెందిన పోచమ్మకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం రూ.3లక్షల ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రాన్ని గాంధీ బుధవారం తన నివాసంలో అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, కాశీనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

– దీపావళి పండుగను పురస్కరించుకుని నియోజకవర్గంలోని ప్రజలకు ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు సహా సకల జనులకు పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ శుభాకాంక్షలు తెలిపారు.

గాంధీకి బీజేపీ కార్పొరేటర్ వినతి

గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ డివిజన్ అభివృద్ధి సహా మౌలిక వసతుల కల్పనకు తగు నిధులు కేటాయించాలని కార్పొరేటర్ కోరారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గం, గోపన్‌పల్లి తండాకు చెందిన సీనియర్ నేతలు, కాలనీ సంఘాల ప్రతినిధులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నేతలు కృష్ణ, నరేందర్, సంజీవ, దయాకర్, వడ్డెర సంఘం ప్రతినిధులు శ్రీరాములు, నరేందర్, శ్యామ్, యాదయ్య, ఆంజనేయులు, శ్రీశైలం, ప్రకాశ్, వేణు, ప్రవీణ్, దుర్గా, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

దీపావళి పండుగను పురస్కరించుకుని హెల్పింగ్ హాండ్స్ యూత్ అసోసియేషన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో బుధవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పల్లవి మానసిక వికలాంగుల ఆశ్రమంలో తలదాచుకుంటున్న 60 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటువంటి సేవా కార్యక్రమాలు చేసినప్పుడు కలిగే ఆనందం వెలకట్టలేనిదన్నారు. తాము వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు అయినప్పటికీ, సమయం దొరికినప్పుడల్లా వృథా చేయకుండా, ఫౌండేషన్ తరపున ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడానికి, పది మందికి పట్టెడన్నం పెట్టడానికి ఎప్పుడూ ముందు వరుసలో ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.చైతన్య కృష్ణ, ఎన్.వృతిక్, డి.సాయినంద్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

– దుండిగల్, అక్టోబర్ 30

కాలనీల్లో సౌకర్యవంతంగా రహదారులు

ఆల్విన్ కాలనీ డివిజన్ సాయినగర్ వెస్ట్ కాలనీలో రూ.17లక్షలతో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణంతో ప్రయాణ వసతులను మరింతగా పెంచుతున్నట్లు తెలిపారు. డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్, రఘు, ప్రవీణ్, రామరాజు, సంతోష్, ఉమేశ్, సంతోశ్, రాజు, కార్తిక్, వినీత్, రవికుమార్ పాల్గొన్నారు.

– మియాపూర్, అక్టోబర్ 30

స్టూడెంట్స్ క్లబ్ ఎన్నిక

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని రిషి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్స్ క్లబ్‌కు బుధవారం ఎన్నికలు జరిగాయి. కల్చరల్ క్లబ్ ప్రెసిడెంట్‌గా శాలిని, స్పోర్ట్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా లిజి జాన్సన్, లిటరరీ క్లబ్ ప్రెసిడెంట్‌గా రాజరాజేశ్వరి, హార్టికల్చర్ క్లబ్ ప్రెసిడెంట్‌గా వైష్ణవి ఎన్నికయ్యారు. 940 మంది విద్యార్థినులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, పలు క్లబ్‌లకు ప్రతినిధులుగా ఎన్నికైన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ రాజశ్రీ అభినందించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు క్లబ్‌లు దోహదపడుతాయని రాజశ్రీ పేర్కొన్నారు.

– మియాపూర్, అక్టోబర్ 30

ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు సన్మానం

కూకట్‌పల్లి జోన్ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన అధికారులను జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్ శాలువాలు, పూలదండలతో సన్మానించి.. ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. జోన్‌లో ఆఫీస్‌లో వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేసిన ఎన్.సుకునందన్‌రెడ్డి, మూసాపేట సర్కిల్ ఉపకమిషర్‌గా పనిచేసిన అడప రమేశ్, జోన్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా పనిచేసిన డి.మల్లేశ్వర్ ఉద్యోగ విరమణ పొందారు. కాగా, బుధవారం జోన్ ఆఫీస్‌లో ఆత్మీయ అభినందన సభ నిర్వహించి వారిని జడ్సీతోపాటుగా ఉన్నతాధికారులు, ఆయా విభాగాల అధికారులు, తోటి ఉద్యోగులు, సిబ్బంది, ఆయా కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఘనంగా సన్మానించారు. కార్యక్రరమంలో జోనల్ ఏఎంసీ శ్రీకాంత్‌రెడ్డి, సీపీ గణపతి, డీసీ కృష్ణయ్య, అధికారులు, సిబ్బంది ఉన్నారు. *– కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 30*

డిగ్రీ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ అధికారులు తెలిపారు. బీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ లాజిస్టిక్స్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకామ్, బీకామ్ ఆనర్స్ తదితర కోర్సుల మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

ఐడీఎల్ చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేయాలి

- భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి రంగధాముని చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారులు

ఉద్యోగ విరమణ పొందిన డీసీ రమేశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 30: కూకట్‌పల్లి రంగధాముని(ఐడీఎల్)చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బుధవారం రంగధాముని చెరువు అభివృద్ధి పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ చేతులమీదుగా 19 కోట్లతో చెరువు సుందరీకరణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి తక్షణమే పూర్తి చేయాలని అన్నారు. ఈ పనులు పూర్తయితే చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు ఆహ్లాదకరమైన పరిసరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

భూములు పోయిన వారికి టీడీఆర్ ఇవ్వాలి

రంగధాముని చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు టీడీఆర్‌తో నష్టపరిహారాన్ని అందించాలని అధికారులను కోరారు. ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన భూముల నుంచి పైప్‌లైన్ పనులు వాకింగ్ ట్రాక్ పనులు చేపట్టాల్సి ఉండగా.. ఈ పనులకు రైతులు అడ్డంకులు చెబుతున్నారన్నారు. అభివృద్ధి పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ కార్యదర్శి వెంకటేశ్, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, హుడా విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సేవలు అభినందనీయం

మూసాపేట్ సర్కిల్‌లో సమర్థవంతంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందుతున్న అధికారుల సేవలు మరువలేనివని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం మూసాపేట్ సర్కిల్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఉప కమిషనర్ ఆడప రమేశ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వర్‌లను ఎమ్మెల్యే కృష్ణారావు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి సర్కిల్ ఉపకమిషనర్ కృష్ణయ్య, మాజీ కార్పొరేటర్ పి.బాబురావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలాంటిదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఫతేనగర్ డివిజన్‌కు చెందిన మహ్మద్ ఆజాద్‌ఖాన్‌కు రూ.1లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ లెటర్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీని సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబురావు, బీఆర్ఎస్ పార్టీ నేతలు

హైడ్రా బాధిత చిన్నారులకు స్కూలు బ్యాగులు అందజేత

అల్లాపూర్, అక్టోబర్ 30: హైడ్రా బాధితుల చిన్నారులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సొంత నిధులతో స్కూలు బ్యాగులు అందజేయడం సంతోషకరమని అల్లాపూర్ కార్పొరేటర్ సబిహగౌసుద్దీన్ అన్నారు. బుధవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సున్నం చెరువు పరివాహక ప్రాంతంలో ఇటీవల హైడ్రా ఇండ్లను కూల్చి వేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే కృష్ణారావు స్కూలు బ్యాగులు, పెన్నులు, పుస్తకాలు అందజేయడం శుభపరిణామం అన్నారు. ప్రజల బాగోగులు తెలుసుకునే నేత ఎమ్మెల్యే కృష్ణారావు ఉన్నంత కాలం ప్రజలకు ఎలాంటి ఆపద రాదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. గత కొంతాలంగా ఎమ్మెల్యే కృష్ణారావు సొంత నిధులతో నిరుపేద విద్యార్థులకు స్కూలు బ్యాగులు అందజేస్తుండటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

జీడిమెట్ల, అక్టోబర్ 30: ప్రేమ విఫలమై ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. జీడిమెట్ల పోలీసులు తెలిపిన ప్రకారం... టీఎస్ఐఐసీ కాలనీ కి చెందిన ఎం.రాజశేఖర్(31) జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేటు కంపెనీలో హెచ్ఆర్‌గా పని చేస్తున్నాడు. ఇతడు ఓ అమ్మాయిని ప్రేమించమంటూ వెంటపడుతూ ఉండటంతో ఆమె అందుకు నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బుధవారం కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు చిన్నారులకు గాయాలు

గాయపడ్డ అదాం, అదిల్

జగద్గిరిగుట్ట, అక్టోబర్ 30:ప్రమాదవశాత్తూ ఇద్దరు చిన్నారులు విద్యుత్ షాక్‌కు గురైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు అంబేద్కర్‌నగర్‌కు చెందిన చిన్నారులు అదిల్(8), అదాం(10) బుధవారం సాయంత్రం స్థానిక బస్తీ దవాఖానా సమీపంలో పటాసులు కాల్చుకుంటున్నారు. ఆపై గాలిపటాలు ఎగురవేస్తుండగా పైన ఉన్న దుకాణాలకు సరఫరా అయ్యే విద్యుత్‌వైర్లు తెగి వారి మీదపడ్డాయి. దీంతో ఇద్దరి చేతులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతి

దుండిగల్,అక్టోబర్30:దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, మల్లంపేటలో అనుమతిలేని అక్రమ భవన నిర్మాణాలు. ఒక్కొక్క వాటికి సుమారు 10పైగా కొత్త కొత్త అక్రమ భవనాలు గ్రామ పంచాయతీ అనుమతితో ఎలాంటి మున్సిపాలిటీ నియమ నిబంధనలు పాటించకుండా కట్టడాలు జరుపుతున్నారు. ఈ అక్రమ కట్టడాలపై ఉన్న టౌన్ ప్లానింగ్ చైన్‌మన్లపై అధికారులకు సరైన సమాచారం ఇవ్వకపోవడం ద్వారా అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇప్పటికైనా దుండిగల్ మున్సిపల్ కమిషనర్ మల్లంపేటలో జరుగుతున్న అక్రమ కట్టడాలపై దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మల్లంపేటలో మున్సిపల్ చట్టాలు అమల్లో లేకపోవడం శోచనీయమని, స్థానిక మున్సిపల్ అధికారులకి మల్లంపేటపై చిన్న చూపువల్ల మొత్తం మల్లంపేటలో అక్రమ కట్టడాలు యదేచ్ఛగా కొనసాగడానికి ప్రత్యేకంగా మున్సిపల్ అధికారులు సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం మల్లంపేట అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేడ్చల్ బీజేవైఎం జిల్లా కార్యదర్శి అతీశ్‌బాబు(సోను) డిమాండ్ చేశారు.

అయ్యప్ప పూజ విధానం పుస్తకం ఆవిష్కరణ

సీనియర్ జర్నలిస్ట్ కోడెం గోపి గురుస్వామి రచన చేసిన అయ్యప్ప పూజ విధానం పుస్తకాన్ని స్థానిక శ్రీనివాసనగర్ కాలనీ అయ్యప్ప దేవాలయం చైర్మన్ కొలను చంద్రశేఖర్ గురుస్వామి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సన్నిదాన స్వాములు, ఇతర స్వాములు(మాలాదారులు)పాల్గొన్నారు.

– దుండిగల్,అక్టోబర్ 30

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 30 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 35, వంకాయ 45, బెండకాయ 65, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 70, కాకరకాయ 45, బీరకాయ 55, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 115, క్యారెట్ 55, కాలీఫ్లవర్ 23, దొండ 50, చిక్కుడు 100, గోరుచిక్కుడు 55, బీట్‌రూట్ 35, క్యాప్సికం 75, ఆలుగడ్డ 36, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్సే

- విద్యుత్ చార్జీల పెంపును ఈఆర్సీ తిరస్కరించడంలో కీలకపాత్ర పోషించిన బీఆర్ఎస్
- గండిమైసమ్మలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తదితరులు

దుండిగల్, అక్టోబర్ 30 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించడం పట్ల కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ఆదేశాల ప్రకారం.. గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు విజయోత్సవ సంబురాలను ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలను తినిపించుకుంటూ సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయాలు పేద ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టకుండా ఉండాలే కానీ ప్రజలు ఎటుపోతే మాకేంటీ అనేలా ఉండకూడదన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనల్లో భాగంగా ప్రభుత్వం దాదాపు 18,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతూ విద్యుత్ నియంత్రణ మండలికి సిఫారసు చేయడం హేయమైన చర్య అని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ,కౌలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేటర్లు సుజాత, బాలాజీనాయక్, దుండిగల్ వైస్ చైర్మన్ పద్మారావు, వివిధ డివిజన్‌ల అధ్యక్షులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ వార్డు కమిటీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంబురాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

నవంబర్ 5 నుంచి ఇంటింటికీ ఎన్యుమరేటర్లు

- ఎటువంటి జీరాక్స్‌లు ఇవ్వాల్సిన అవసరం లేదు
- జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

సర్వే నిర్వహణపై ఎన్యుమరేటర్ల సమావేశంలో జడ్సీ

మియాపూర్, అక్టోబర్ 30: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణనపై క్షేత్రస్థాయిలో నవంబర్ 5 నుంచి 20వ తేదీ వరకు ఇంటింటి సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తున్నదని, ఇంటింటికీ వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించి వివరాలను అందజేయాలని కోరారు. జోన్ వ్యాప్తంగా 1,73,066 నివాసాలలో నిర్వహించాల్సిన సమగ్ర సర్వేపై జోనల్ కార్యాలయంలో బుధవారం ఎన్యుమరేటర్లతో జడ్సీ ఉపేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జోన్ పరిధిలోని నాలుగు సర్కిళ్లలో మొత్తం 2211 ఎన్యుమరేటర్లు ఈ సర్వేను చేపట్టి ఇంటింటి నుంచి పలు వివరాలను సేకరిస్తారన్నారు. ఇందుకు గాను వచ్చే నెల 1–4 వ తేదీ వరకు ఎన్యుమరేటర్లకు సమగ్ర శిక్షణ అందించి, 5వ తేదీ నుంచి ఇంటి వద్ద తాము అందించిన ఫార్మాట్ ద్వారా వివరాల నమోదు చేపట్టాలని జడ్సీ సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటరు కార్డు సహా ఇతర పత్రాలను ప్రజలు సిద్ధంగా ఉంచుకోవాలని, ఎన్యుమరేటర్లకు సమాచారం మాత్రమే ఇవ్వాలని, ఎటువంటి జీరాక్సు ప్రతులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేసారు. ఒక్కో ఎన్యుమరేటరు 150 ఇండ్ల నుంచి వివరాలను సేకరించాలని, ప్రతి పది మంది ఎన్యుమరేటర్లను ఒక పర్యవేక్షుడు ఉంటారని, వారి క్షేత్రస్థాయి వివరాల సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని జడ్సీ సూచించారు. ప్రతి ఇంటిపైనా సర్వే స్టిక్కర్‌ను అతికించాలన్నారు. సర్వే పూర్తయిన అనంతరం 25వ తేదీలోగా సేకరించిన వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను నిర్వహించాలన్నారు. తప్పులు లేకుండా సర్వేను పూర్తి చేసి సమగ్రమైన వివరాలను సేకరించాలని జడ్సీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీ ముకుందరెడ్డి, ఇతర అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న ప్రైవేట్ బస్సులు

పట్టించుకోని అధికారులు

బుధవారం షాపూర్‌నగర్‌లో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ ఢీకొట్టడంతో మృతి చెందిన వ్యక్తి

సంఘటనా స్థలంలో విలపిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

దుండిగల్, అక్టోబర్ 30: ప్రైవేట్ వాహనాలు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. వివిధ పనులపై రోడ్డు మీదికి వచ్చే ప్రజల ప్రాణాలకు ప్రైవేట్ వాహనాలతో భరోసా లేకుండా పోతున్నది. ఇందుకు ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన లారీలు, బస్సులు, ట్రక్కుల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపడమే కారణమంటున్నారు ప్రజలు. ఫలితంగా ఏ పాపం చేయని అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారంలో ఉన్న ఓట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన బస్సులు ఢీకొని పదుల సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకున్న వారు ఉన్నారంటే ఆశ్చర్యం వేయక మానదు. సదరు సంస్థ జీడిమెట్ల, ఖాజీపల్లి, పఠాన్‌చెరు తదితర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులను నగరంలోని నలుమూలల నుంచి ప్రతినిత్యం ఇంటి నుంచి పరిశ్రమకు, పరిశ్రమల నుంచి ఇంటికి లీజు ప్రాతిపదికన చేరుస్తూ ఉంటుంది. అదే విధంగా పలు విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థుల సౌకర్యార్థం సైతం రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ సదరు సంస్థలో పనిచేస్తున్న డ్రైవర్లు సుశిక్షితులు కాకపోవడం కారణంగా దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం ఏదో ఓ చోట సంబంధిత సంస్థకు చెందిన వాహనాలు ప్రమాదానికి కారణమవుతూనే ఉంటాయంటున్నారు స్థానికులు. అయితే యాక్సిడెంటు కేసుల్లో ఈజీగా బెయిల్ లభిస్తుండటం, తమ సంస్థ యజమాని డ్రైవర్లపై ఈగ వాలకుండా మేనేజ్ చేయడంతోనే ఆ సంస్థకు చెందిన డ్రైవర్లు వాహనాలను మితిమీరిన వేగంతో నడుపడం, ప్రశ్నించిన వారిపట్ల దురుసుగా ప్రవర్తిస్తుండటం చేస్తుంటారని పలువురు పేర్కొంటున్నారు. పోలీసులు, రవాణాశాఖ అధికారులు సైతం ఈ సంస్థకు చెందిన వాహనాలతో ప్రమాదా